

చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకు వద్ద బాధితులు (పాత చిత్రం)

నేటి నుంచి కొనసాగనున్న సీఐడీ విచారణ

నరేష్ సెల్ఫీ వీడియోపై అధికారుల ఆరా

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడ భారతీనగర్ ఐసీఐసీఐ బ్యాంకుల్లో గత మేనేజర్ నరేష్ అక్రమాలపై సీఐడీ విచారణ తిరిగి సోమవారం నుంచి కొనసాగనుంది. ఐసీఐసీఐ బ్యాంక్ జోనల్ మేనేజర్ (జడ్ఎం) సందీప్‌మెహ్రా 72 మంది ఖాతాదారులకు సంబంధించి రూ.28 కోట్లు మోసం జరిగినట్లు సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో గత గురువారం నుంచి శనివారం వరకు చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకులో సిబ్బంది, బాధిత ఖాతాదారులను గుంటూరు సీఐడీ అదనపు ఎస్పీ ఆదినారాయణ, సీఐ సంజీవ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో విచారిస్తున్న విషయం విధితమే. రెండు రోజులు సెలవు రావడంతో విచారణ నిలిచింది. ఈ నేపథ్యంలో గత మేనేజర్ నరేష్ సెల్ఫీ వీడియో బయటకు రావడంతో కలకలం రేగిన విషయం తెలిసిందే. తాను మేనేజర్‌గా పనిచేసిన చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడ భారతీనగర్ బ్యాంకులలో అందరికీ అంతా తెలుసన్నారు. అయినా తనొక్కడినే దోషిగా నిలబెడుతున్నారని సెల్ఫీ వీడియోలో కన్నీటి పర్యంతమయ్యారు. దాంతో పాటు 10 మంది పేర్లు కూడా వెల్లడించారు. తాను మొత్తం ట్రాన్సాక్షన్లు బ్యాంకు ద్వారానే నిర్వహించినట్లు తెలిపారు. దీంతో బ్యాంకు ఉన్నతాధికారులు, సీఐడీ అధికారుల దృష్టికి నరేష్ సెల్ఫీ వీడియోలు వెళ్లాయి. దీంతో ఖాతాదారుల నగదు మోసంలో ఎవరెవరి పాత్ర ఎంత ఉంది. నరేష్ సెల్ఫీ వీడియోలో వెల్లడించిన వారి పాత్రపై కూడా సీఐడీ దృష్టి సారించినట్లు సమాచారం. ఆదివారం చాలామందికి బ్యాంకు ఉన్నతాధికారులు చిలకలూరిపేట బ్యాంకు వద్దకు రావాలని సమాచారమిచ్చారు. నరేష్ సెల్ఫీ వీడియోతో ఈ కేసు ఒక కొలిక్కి వచ్చినట్లేనని, బాధితులకు న్యాయం జరుగుతుందని బ్యాంకు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

బైక్ అంబులెన్స్‌తో ప్రథమ చికిత్స సేవలు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే: ప్రమాదానికి గురై గాయపడిన బాధితులకు బైక్ అంబులెన్స్‌తో ప్రథమ చికిత్స సేవలు అందించనున్నట్లు ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. నరసరావుపేట జిల్లా పోలీసు కార్యాలయంలో దీర్ఘాయుష్మాన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన బైక్ అంబులెన్స్‌ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆపద సమయం కీలకమైందని, 83400 00108, 81860 00108 నంబర్లకు ఫోన్ చేసి నరసరావుపేట పరిసర ప్రాంత ప్రజలు 24 గంటలు ఈ సేవలు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. సంఘటన స్థలానికి వైద్యునితో పాటు నర్సు చేరుకుని అత్యవసర మందులు, ఆక్సిజన్ వంటివి క్షతగాత్రులకు ఉచితంగా అందిస్తారన్నారు. వైద్యులు చింతా కృష్ణచైతన్య, మేనేజరు శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



అంబులెన్స్ బైక్‌ని ప్రారంభిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

ఎస్పీ కార్యాలయంలో ఆయుధపూజ: విజయదశమి పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో అమ్మవారికి శనివారం ఎస్పీ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయుధాలు, వాహనాలకు పూజలు చేశారు. ఏఎస్పీలు సంతోష్, రామచంద్రరాజు, లక్ష్మీపతి, నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ గాంధీ రెడ్డి, సీఐలు, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నారా రోహిత్.. మన రెంటచింతల అల్లుడే



గురజాల, రెంటచింతల, న్యూస్‌టుడే : సినిమా నటుడు నారా రోహిత్‌తో ఆదివారం నిశ్చితార్థం జరిగిన హీరోయిన్ శిరీషా స్వస్థలం రెంటచింతల. వీరిది సామాన్య రైతు కుటుంబం. గురజాల మండలం దైదకు చెందిన నాగేశ్వరరావు ముప్పై ఏళ్ల క్రితం గ్రామం విడిచి రెంటచింతల వలసొచ్చారు. వ్యవసాయం చేస్తూ కష్టపడి తమ నలుగురు కుమార్తెలను ఉన్నత చదువులు చదివించారు. పెద్దమ్మాయి శ్రీలక్ష్మి రెంటచింతలలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. రెండో అమ్మాయి భవానీ వివాహం అనంతరం అమెరికాలో స్థిరపడ్డారు. మూడో అమ్మాయి ప్రియాంక వివాహం చేసుకొని హైదరాబాద్‌లో ఉంటున్నారు. నాలుగో అమ్మాయి శిరీష ఆస్ట్రేలియాలో ఉన్నత చదువులు పూర్తి చేసి అక్కడే కొంతకాలం ఉద్యోగం చేశారు. సినీరంగంపై అభిమానంతో హైదరాబాద్‌కు వచ్చారు. తన అక్క ప్రియాంక వద్ద ఉంటూ సినిమాల్లో నటించేందుకు ప్రయత్నాలు చేశారు. నారా రోహిత్ హీరోగా నటించిన ప్రతినిధి-2లో హీరోయిన్‌గా అవకాశం దక్కించుకున్నారు. వీరిద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకోవడంతో ఆదివారం హైదరాబాద్‌లో వేడుకగా నిశ్చితార్థం నిర్వహించారు.

దుకాణం తెరిచేదెవరో?

ఈనాడు-నరసరావుపేట, న్యూస్‌టుడే- నరసరావుపేట టౌన్

జిల్లాలో దుకాణాలు	వచ్చిన దరఖాస్తులు	సమకూరిన ఆదాయం
129	2638	రూ.52.76 కోట్లు



నరసరావుపేట ఎక్సైజ్ శాఖ కార్యాలయం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణకు సోమవారం లాటరీ ప్రక్రియ ద్వారా లైసెన్సుదారుల ఎంపికకు జిల్లాలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. జిల్లాలోని 129 మద్యం దుకాణాలకు లాటరీ నిర్వహించేందుకు నరసరావుపేట ప్రకాష్‌నగర్ టౌన్ హాల్‌లో ఇందుకు సర్వం సిద్ధం చేశారు. తొలుత నరసరావుపేట పట్టణంతో పాటు మిగతా పురపాలక సంఘాల్లోని దుకాణాలు, ఆ తర్వాత గ్రామీణ ప్రాంత దుకాణాలకు లాటరీ తీయనున్నారు. పురపాలక సంఘం, మండలం యూనిట్‌గా కేటాయించిన దుకాణాలకు నిర్దేశిత రుసుం రూ.2 లక్షలు వంతున చెల్లించిన వారి నుంచి మొత్తం 2,639 దరఖాస్తులు అందినట్లు అబ్కారీ శాఖ అధికారులు తెలిపారు. ఈ లెక్కన ప్రభుత్వానికి జిల్లాలోని దరఖాస్తుదారుల నుంచి రూ.52.78 కోట్లు ఆదాయం లభించింది. గురజాల నియోజకవర్గం మాచవరం మండలంలోని రెండు దుకాణాలకు పోటాపోటీగా అత్యధిక సంఖ్యలో దరఖాస్తు చేశారు. ఈ మండలంలోని దుకాణం నెం: 85కి అత్యధికంగా 46 దరఖాస్తులు నమోదయ్యాయి. ఇక్కడే మరో దుకాణం నెం: 84కి 44 దరఖాస్తులు వేశారు. వినుకొండ నియోజకవర్గం బొల్లాపల్లి మండలంలోని దుకాణం నెం: 113కి 43 దరఖాస్తులు, ఈపూరు మండలంలోని దుకాణం నెం:111కి 41 దరఖాస్తులు వంతున పోటీపడ్డారు. పారిశ్రామిక ప్రాంతమైన చిలకలూరిపేట నియోజకవర్గంలో వ్యాపారులు అంతగా ఆసక్తి చూపకపోవడం గమనార్హం. ఇక్కడ నాదెండ్ల మండలంలోని నాలుగు దుకాణాల్లో ఒక్కొక్కదానికి 8 వంతున, మరొక దుకాణానికి 9 మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. మాచర్ల పట్టణంలోని దుకాణం నెం:24కి 9, వెల్దుర్తి మండలంలోని దుకాణం నెం:100కి 8 దరఖాస్తులు వేశారు. దరఖాస్తుల తీరు పరిశీలిస్తే రాష్ట్రంలో జిల్లా అట్టడుగున 20వ స్థానంలో నిలిచింది.

ఉదయం 6-6.30 గంటల మధ్య లోపలికి ప్రవేశం

8 గంటలకు లాటరీ ప్రక్రియ ప్రారంభం

లాటరీలో షాపు దక్కించుకున్నవారు అదే రోజు ఆరో వంతు ఫీజు జమ చేయాలి



ఏఎస్పీ సంతోష్‌కు వివరాలు వెల్లడిస్తున్న ఈఎస్ మణికంఠ

ఒక్కో దుకాణానికి ముగ్గురు చొప్పున ఎంపిక

నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్ టౌన్‌హాల్‌లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జిల్లా పాలనాధికారి అరుణ్‌బాబు, అబ్కారీ శాఖ ఏసీ రవీంద్రారెడ్డి, ఈఎస్ మణికంఠతో పాటు పలువురు అధికారుల సమక్షంలో లాటరీ తీయనున్నారు. దరఖాస్తుదారులు, ఏదైనా కారణంతో గైర్హాజరైతే.. వారి ప్రతినిధులను మాత్రమే లోపలికి అనుమతించనున్నారు. ఒక్కొక్క దుకాణానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయో వారందరి సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహిస్తారు. లక్కీ విజేతతో పాటు రిజర్వుడు(ఆర్-1, ఆర్-2) కేటగిరిలో మరో ఇద్దరిని కూడా ఎంపిక చేయనున్నారు. తొలి విజేత ఒక రోజు వ్యవధిలో నిర్దేశిత ఎక్సైజ్ లైసెన్స్ ఫీజు చెల్లించకపోతే ఆ తర్వాత వారికి వరుసగా అవకాశం లభించనుంది. ఈ ముగ్గురు కూడా ముందుకు రాకపోతే మరొకసారి నోటిఫికేషన్ జారీ చేస్తారు.

ఒక్కో విడతలో ఐదు దుకాణాలకు..

సోమవారం లాటరీ నిర్వహణకు గంట ముందుగానే నిర్దేశిత లాటరీ నిర్వహణ ప్రదేశానికి చేరుకోవాలని దరఖాస్తుదారులకు ఎక్సైజ్ శాఖ యంత్రాంగం సూచించింది. ఉదయం 6 నుంచి 6.30 గంటల మధ్య ఎంట్రీ పాస్‌తో లోపలికి చేరుకోవాలని ఎంట్రీ పాస్ వెంట తెచ్చుకుంటేనే అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఒక్కో విడతలో ఐదు షాపులకు లాటరీ తీయడానికి దరఖాస్తుదారులను లోపలికి పంపుతారు. మిగిలిన షాపులకు దరఖాస్తు చేసుకున్న అప్పటి వరకు అధికారులు సూచించిన చోట కూర్చోవాలని వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా సాగేలా ఏర్పాట్లు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని మద్యం దుకాణాలకు లాటరీ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసుశాఖ బందోబస్తు చర్యలు తీసుకుంటుందని ఏఎస్పీ (అడ్మిన్) సంతోష్ తెలిపారు. నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో మద్యం దుకాణాల లాటరీ ఏర్పాట్లను ఆదివారం ఏఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా అబ్కారీ శాఖ జిల్లా అధికారి (ఈఎస్) మణికంఠను ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావుకు పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, దరఖాస్తుదారులు, విజేతలకు పోలీసు రక్షణ, నగదు లావాదేవీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఎటువంటి ఘర్షణలు, వివాదాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయనతో పాటు అబ్కారీ శాఖ సీఐ సోమయ్య, నరసరావుపేట ఒకటో పట్టణ సీఐ విజయచరణ్, వినుకొండ గ్రామీణ సీఐ ప్రభాకర్, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే నరసరావుపేట భువనచంద్ర టౌన్ హాల్‌ని అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ (డీసీ) శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 129 దుకాణాలకు 2,639 దరఖాస్తులు వచ్చాయని, వారందరి సమక్షంలోనే ఆయా దుకాణాలకు లాటరీ తీస్తామన్నారు. బయట వ్యక్తులను లోపలికి అనుమతించకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారందరూ తప్పనిసరిగా నిర్దేశిత సమయానికి హాజరు కావాలన్నారు. .





నకరికల్లు మండలం నర్సింగపాడులో తెప్పోత్సవం



దుర్గిలో బతుకమ్మల ప్రదర్శనలో మహిళలు



పిడుగురాళ్ల పురవీధుల్లో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

దసరా నవరాత్రి ఉత్సవాలు ఊరూవాడా ఘనంగా సాగాయి. దశమి పండగ రోజు గ్రామాల్లో సందడి నెలకొంది. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రామాల్లో అమ్మవారికి వైభవంగా పల్లకీ సేవ జరిపారు. పలుచోట్ల తెప్పోత్సవం నిర్వహించారు. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. - న్యూస్‌టుడే బృందం

టెట్ పరీక్షకు 86.5 శాతం హాజరు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ఏపీ టెట్ పరీక్షలు నరసరావుపేటలోని రెండు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించారు. ఏఎంరెడ్డి స్మారక ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలల్లో రెండు పూటలా పరీక్షలు సాగాయి. 761 మందికి 659 మంది పరీక్ష రాశారు. 86.5 శాతం మంది పరీక్షకు హాజరైనట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

పవర్ లిఫ్టింగ్‌లో మంగళగిరి క్రీడాకారిణి ప్రతిభ


మంగళగిరి, న్యూస్‌టుడే: సౌత్ ఆఫ్రికాలోని సన్‌సిటీలో ఈ నెల 4వ తేదీ నుంచి 13 వరకు జరిగిన కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్ పోటీల్లో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి షేక్ సాదియా అల్మాస్ నాలుగు బంగారు పతకాలు సాధించినట్లు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ భాస్కరరావు, షేక్ సందాని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 57 కేజీల విభాగం, స్క్వాట్ - 185 కేజీలు, బెంచ్ ప్రెస్ 95 కేజీలు, డెడ్ లిఫ్ట్ 180 కిలోల విభాగాల్లో పసిడి పతకాలు అందుకున్నారు. సాదియా అల్మాస్‌కు మంత్రి నారా లోకేశ్, సౌత్ఇండియా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు, ఏపీ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటా వెంకటేశ్వరరావు. సకల సూర్యనారాయణ తదితరులు అభినందనలు తెలిపారు

పట్టా పొందక.. రుణాలు అందక

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, శావల్యాపురం

గతేడాది ఆగస్టు నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు అందజేయకపోవడంతో దరఖాస్తు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా పొలం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తరువాత రిజిష్టరు దస్తావేజులు ఆధారంగా చూపి స్థానిక తహసీల్దారు కార్యాలయంలో కొత్తగా ఈ-పట్టాదారు పాసు పుస్తకానికి కొంతమంది దరఖాస్తు చేసుకోగా, వారసత్వంగా వచ్చిన ఆస్తిని తమ పేరు మీద నమోదు చేయించుకోవడానికి కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. ఇంకొందరు అన్నదమ్ములు వాటాలు పంపిణీలు చేసుకుని ఉమ్మడి ఆస్తిని పంచుకొని కొత్తగా పట్టాదారు పుస్తకాలు కావాలని రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసి సంవత్సరం గడుస్తున్నా ఇంత వరకు ఇవ్వకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు



ప్రభుత్వ ప్రోత్సాహకాలు దూరం..

పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి నిధి కింద కొంత మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నాయి. ముఖ్యంగా ఎరువులు, విత్తనాలు, యాంత్రీకరణ పథకం కింద పనిముట్లు పొందాలంటే తప్పనిసరిగా పట్టాదారు పాసు పుస్తకం ఉండాలి. అంతేకాకుండా ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటకు నష్టం వాటిల్లి రైతు బీమా పొందాలన్నా పుస్తకం తప్పనిసరి. పంటలు సాగు చేసే సమయంలో బ్యాంకు నుంచి రుణాలు పొందాలన్నా రెవెన్యూ అధికారులు జారీ చేసే పట్టాదారు పాసు పుస్తకం ప్రామాణికం. ఇంత ప్రాధాన్యం ఉన్న వాటిని మంజూరు చేయడంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా సకాలంలో పొందలేకపోతున్నామని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. దరఖాస్తు చేయడానికి అయ్యే ఖర్చును కూడా భరించినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతోందని వాపోతున్నారు.

తహసీల్దారు కార్యాలయాల్లోనే నిర్లక్ష్యం..

గ్రామ సచివాలయాల్లో పట్టాదారు పాసు పుస్తకం కావాలని దరఖాస్తు చేసిన వెంటనే అదీ గ్రామ రెవెన్యూ అధికారి వద్దకు వెళ్తుంది. అక్కడ వీఆర్వో నివేదిక తయారు చేసి రెవెన్యూ ఇన్‌స్పెక్టరు దగ్గరకు పంపిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత డిప్యూటీ తహసీల్దారు వద్దకు చేరుతుంది. వివరాలన్నీ సక్రమంగా ఉంటే ముందుకు వెళ్తుంది. లేకుంటే తిరస్కరిస్తారు. దరఖాస్తు చేసిన రైతు కొన్ని రోజుల తరువాత వీఆర్వో దగ్గరకు వెళ్లాక మీ దరఖాస్తు తిరస్కరణకు గురైంది.. తిరిగి దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారు. చేసేది లేక అన్నదాతలు మళ్లీ దరఖాస్తు చేస్తున్నారు. ఇప్పటికే సంవత్సరం గడిచింది. మరి ఎప్పటికి పుస్తకాలు వస్తాయోనని రైతులు పెదవి విరుస్తున్నారు.

దరఖాస్తు చేసి సంవత్సరం దాటింది



నేను శావల్యాపురం రెవెన్యూ గ్రామ పరిధిలో అర ఎకరం కొనుగోలు చేసి గతేడాది సెప్టెంబరు నెలలో దరఖాస్తు చేశాను. ఇంతవరకు దాని గురించి ఏమైందో తెలియలేదు. దీని వల్ల ప్రభుత్వం అందచేసే రైతు బీమా, పీఎం కిసాన్ నిధి పొందలేకపోతున్నా. అంతేకాకుండా కుటుంబ సభ్యుల ద్వారా వచ్చిన మరో అర ఎకరానికి పట్టాదారు పాసు పుస్తకం వచ్చింది. ఆ విస్తీర్ణం కలిపి మొత్తం ఒకే పుస్తకం ఇవ్వాలని దరఖాస్తు చేశాను. అదీ ఏమైందో అర్థం కావడం లేదు. అధికారులను అడిగితే అదిగో వస్తుందని.. ఇదిగో వస్తుందని చెబుతున్నారు. **- కోట్ల వెంకటేశ్వరరావు, శావల్యాపురం**

13 నెలలైనా.. అతీగతి లేదు..



నేను, నా సోదరుడు ఇద్దరం మా తండ్రి ద్వారా సంక్రమించిన పొలాన్ని వాటాలు పంపిణీ చేసుకొని, గతేడాది ఆగస్టు నెలలో ఈ-పట్టాదారు పాసు పుస్తకం కోసం కొత్తలూరు సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాం. సంవత్సరం గడిచినా రాకపోవడంతో తిరిగి ఈ ఏడాది ఆగస్టులో వీఆర్వోను సంప్రదించాం. దరఖాస్తులో తేడా జరిగిందని చెప్పి, రెండోసారి దరఖాస్తు చేయించారు. ఇప్పటికీ రెండు నెలలైంది. ఈ సారైనా కొత్త పుస్తకం వస్తోందో లేదో అర్థం కానీ పరిస్థితి.

- పొందూరి హరిబాబు, రైతు శావల్యాపురం

ఆయువు విడిచి.. చిరంజీవిగా నిలిచి..

బ్రెయిన్ డెడ్ వ్యక్తి అవయవాలు దానం



శ్రీనివాసరావు (పాతచిత్రం)

తాడేపల్లి, నిజాంపట్నం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో కుటుంబ యజమాని బ్రెయిన్ డెడ్‌కు గురవడంతో వారంతా అంతులేని దుఃఖంలో మునిగిపోయారు. ఆ బాధను దిగమింగుతూ ఆ వ్యక్తి అవయవాలు దానం చేసేందుకు అంగీకరించి మానవత్వం చాటారు. ఆ నిర్ణయం మరో నలుగురి ప్రాణాలు నిలిపింది. వివరాల్లోకెళితే.. బాపట్ల జిల్లా నిజాంపట్నానికికి చెందిన మత్స్యకారుడు చెన్ను శ్రీనివాసరావు(48) ఈ నెల 11వ తేదీన ద్విచక్ర వాహనంపై కృష్ణాజిల్లా మచిలీపట్నం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మోపిదేవి సమీపంలో కొక్కిలిగడ్డ వద్ద ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలపాలైన అతడిని కుటుంబ సభ్యులు గుంటూరు జిల్లా తాడేపల్లి మణిపాల్ వైద్యశాల్లో చేర్చారు. వైద్యులు శ్రమించినప్పటికీ ఆయన ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో వైద్య పరీక్షల అనంతరం ఆదివారం బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. శ్రీనివాసరావు అవయవాలను దానం చేసేందుకు భార్య విజయలక్ష్మి, కుమారులు సురేష్, సుబ్రహ్మణ్యం అంగీకారం తెలిపారు. దీంతో ఏపీ జీవన్‌దాన్ ఛైర్మన్ డాక్టర్ రాంబాబు, మణిపాల్ వైద్యశాల డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి నేతృత్వంలో మణిపాల్ వైద్యశాలకు కాలేయం, రెండు కిడ్నీలు, కళ్లను డాక్టర్ ఎల్‌వీ ప్రసాద్ వైద్యశాలకు అందించారు. కాగా, శ్రీనివాసరావు మృతదేహానికి ఆదివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

తండ్రికి తనయ అంత్యక్రియలు

గుంటూరు : తండ్రికి తనయే అంత్యక్రియలు నిర్వహించిన ఘటన గుంటూరులో చోటుచేసుకుంది. గోరంట్ల అన్నపూర్ణ నగర్‌కు చెందిన మేరావత్ బాబ్జి పిడుగురాళ్లలో ఏపీ సీపీడీసీఎల్‌లో ఏడీఈగా పని చేస్తున్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 11న ఆయన మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె జాహ్నవి బీటెక్ పూర్తి చేసి దిల్లీలో శిక్షణ పొందుతుండగా. . ద్వితీయ కుమార్తె సాయి బీటెక్, మూడో కుమార్తె మౌనిక పదో తరగతి చదువుతున్నారు. కుమారులు లేకపోవడంతో బాబ్జి అంత్యక్రియలను పెద్ద కుమార్తె జాహ్నవి కొరిటెపాడులోని శ్మశాన వాటికలో శనివారం నిర్వహించారు.



తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న జాహ్నవి

ముందుగానే లీకులు.. ఆపై మొక్కుబడి తనిఖీలు

మార్కెట్‌ను వదలని నకిలీ మందులు

న్యూస్‌టుడే, వినుకొండ

ముందుగానే లీకులివ్వడం.. ఆపై వెళ్లి మొక్కుబడిగా తనిఖీలతో మాయదారి మందుల పీడ వదలడం లేదు. ఈఏడాది జులైలో వినుకొండలో ప్రత్యేక అధికారుల బృందం తనిఖీ చేసి ఓ కంపెనీలో అనధికారంగా ఉన్న రూ.7.30లక్షల విలువైన క్రిమినాశిని మందులను సీజ్ చేసి లైసెన్స్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు. మూడు నెలల వ్యవధిలోనే అదే సంస్థలో ఇటీవల స్థానిక అధికారి తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా లేవని సుమారు రూ.3లక్షల విలువైన బయోఉత్పత్తుల అమ్మకాలు నిలిపేసినట్లు ప్రకటించారు. లైసెన్స్ పునరుద్ధరించడం మళ్లీ ఉత్పత్తి చేయడం అనతికాలంలోనే చోటుచేసుకున్న ఈ రెండు సంఘటనలను గమనిస్తే అక్రమాలపై చర్యలు ఎంత పలుసగా ఉన్నాయో అర్థమవుతోంది. ఈ క్రమంలోనే అనధికార బయోఉత్పత్తులు, నకిలీ పురుగు మందులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి.

పట్టణంలో ఇటీవల బయోఉత్పత్తులు తయారు చేసే రెండు కంపెనీలకు ముందుగానే లీకులివ్వడంతో తనిఖీలకు ముందుగానే గోదాముల్లో ఏమీ లేకుండా జాగ్రత్తపడ్డారు. ఇందుకు సహకరించిన అధికారికి బహుమతి ప్రదానం జరిగిందని ప్రచారం జరుగుతోంది. అయితే ఆపై అధికారి మరోసారి తనిఖీ చేసి ఆ ఇద్దరు వ్యాపారులపై చర్యలకు ఉపక్రమించడంతో డబ్బు పాయే.. కేసు పెట్టె.. అంటూ చెప్పి బాధిత వ్యాపారులు లబోదిబోమంటున్నారు. నిఘా విభాగం తనిఖీ చేసినా.. స్థానిక అధికారులు అమ్మకాలు నిలిపేయాలని ఆదేశించినా ప్రధాన కంపెనీ మాత్రం నిరాటంకంగా నడుస్తోంది. నియోజకవర్గంలోని మరో మండలంలో అక్కడ అధికారి ముందుగానే లీకులిచ్చి తనిఖీకి వెళ్లగా అంతా సక్రమంగానే చూపించారు.

వ్యాపారులకు హెచ్చరికలు

ఇన్‌ఛార్జి ఏడీఏగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న రవికుమార్ అనైతిక వ్యాపారంపై కఠినంగా ఉంటానని చెప్పారు. ఇటీవల వ్యాపారులతో సమావేశం నిర్వహించి అవసరమైతే కేసులు పెడతానని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. పార్సిల్ కార్యాలయాలకు వచ్చే వ్యవసాయ మందులపై కన్నేసి ఉంటామని, అవసరమైతే స్థానిక పోలీసుల సాయం తీసుకుంటామని చెప్పారు.

విద్యార్థులకు అపార్

- ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు కార్డు
- తొలుత 9, 10 తరగతుల వారికి జారీ

న్యూస్‌టుడే, నరసరావుపేట వ్యవసాయం

జాతీయ విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థికి ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో ఉన్న కార్డు జారీ చేయాలని నిర్ణయించింది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ పేరిట కేంద్ర విద్యాశాఖ 12 అంకెలతో కూడిన కార్డు మంజూరు చేయనుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియకు జిల్లాలో విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

జిల్లాలో మొత్తం పాఠశాలలు: 1576

విద్యార్థులు 2.74 లక్షల మంది



❖ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) అందించేందుకు తల్లిదండ్రుల నుంచి అనుమతి పత్రం తీసుకోవాలని హెచ్‌ఎంలు, యాజమాన్యాలకు సూచించారు. తొలుత 9, 10 తరగతుల విద్యార్థులకు నెలాఖరులోపు అందజేయడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. దసరా సెలవుల అనంతరం కార్యాచరణ వేగవంతం చేయనున్నారు. తొలివిడత పూర్తికాగానే మిగిలిన తరగతులు, పీజీ వరకు జారీ చేయడానికి సన్నాహాలు ప్రారంభమవుతాయి.

❖ తొలివిడతలో 9, 10 తరగతి చదివే విద్యార్థులకు అపార్ ఐడీని రూపొందించేలా చర్యలు ప్రారంభించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే 9వ తరగతి విద్యార్థులు 30,814 మంది, పదోతరగతి విద్యార్థులు 28,176 ఉన్నారు. మొత్తం మీద 58,990 మందికి అపార్ కార్డులు అందించనున్నారు.

కార్డులో పొందుపర్చే అంశాలు: డిజిటల్ కార్డులో విద్యార్థి పూర్తి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు సంఖ్య ఉంటాయి.

ఉపయోగాలు

❖ విద్యార్థులు వివిధ కారణాలతో విద్యాసంస్థలు మారుతూ ఉంటారు. అపార్ గుర్తింపు సంఖ్య వివిధ రాష్ట్రాల్లోని విద్యా బోర్డులతో ఏకీకృత వ్యవస్థగా పని చేస్తుంది. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారేటప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తారు.

❖ అపార్ గుర్తింపుతో విద్యార్థులు డిజీలాకర్‌కు అనుసంధానమవుతారు. విద్యావిషయ విజయాలు, ధ్రువపత్రాలను డిజిటల్ రూపంలో సురక్షితంగా భద్రపరుచుకోవచ్చు. ఆయా ధ్రువపత్రాలు ఎక్కడైనా డిజిటల్ రూపంలో వినియోగించుకోవచ్చు.

❖ పిల్లల అకడమిక్ రికార్డుల పర్యవేక్షణ ద్వారా డ్రాపౌట్లు నివారించే అవకాశం ఉంది. విద్యార్థి ఏ కారణంతోనైనా పాఠశాలకు దూరమైతే పూర్తి సమాచారం తెలుసుకునే అవకాశం ఉంది.

❖ విద్యార్థుల ఉపకార వేతనాలు, వారు పొందుతున్న ప్రభుత్వ ప్రయోజనాలు, వివిధ విద్యా సంస్థలో చేరికలు, మార్పులు వంటి సమాచారం అపార్ ఆధారంగా నిర్వహించేలా రూపొందించారు.

❖ జిల్లాలో 9, 10 తరగతులు చదివే 58,990 మందికి అపార్ ఐడీ కార్డులు ఇవ్వటానికి నమోదు ప్రక్రియ ప్రారంభించామని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉదయాన్నే వచ్చేస్తా అంటూ.. తిరిగిరాని లోకాలకు

పెద్దమ్మ ఇంటికి వెళుతూ బాలిక దుర్మరణం



కావ్య (పాతచిత్రం)

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే : దసరా సెలవులు ఆదివారంతో పూర్తవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ బాలిక పెద్దమ్మ కుమారుడు (సోదరుడు) వస్తే అతనితో వారి ఇంటికి వెళ్లలని మారాం చేసింది. దీంతో సోమవారం పాఠశాల సమయానికి వచ్చేయాలని తల్లి షరతు పెట్టి పెద్దమ్మ ఇంటికి వెళ్లమంది. అదే ఆ బాలిక పాలిట యమపాశమైంది. ట్రాక్టర్ ఢీకొనడంతో బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడుకు చెందిన జొన్నలగడ్డ కోటేశ్వరరావు, సీతమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. రెండో సంతానమైన కావ్య(13) ఆదివారం పెద్దమ్మ కుమారుడు వంశీ ఇంటికి రావడంతో వారి ఇంటికి ఫిరంగిపురం మండలం 113తాళ్లూరుకు వెళ్తానని తల్లిని బతిమాలింది. ఆమె అనుమతితో వెళ్లింది. ఈ నేపథ్యంలో లక్కరాజుగార్లపాడు సమీపంలోనే వారు వెళ్తున్న ద్విచక్ర వాహనం, కూలీలతో వెళ్తున్న ట్రాక్టరు అదుపుతప్పి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కావ్య అక్కడికక్కడే మృతి చెందింది. వంశీకి తీవ్ర గాయాలై గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంఘటనా స్థలాన్ని గ్రామీణ పోలీసులు పరిశీలించి కేసునమోదు చేశారు. హతాశులైన తల్లిదండ్రులు కుమార్తె మరణాన్ని జీర్ణించుకోలేక పోయారు. కావ్య తల్లిదండ్రులకు ముగ్గురు సంతానంలో పెద్దకుమార్తె మానసిక దివ్యాంగురాలు. మూడో సంతానం అబ్బాయి మూడో తరగతి చదువుతున్నాడు.

తిరుగు ప్రయాణంలో అవస్థలు



దసరా సెలవులు ముగియడంతో పాఠశాలలు, కళాశాలలు, బంధువుల ఊళ్లకు వెళ్లే వారితో జిల్లా కేంద్రమైన నరసరావుపేట బస్టాండ్ కిక్కిరిసింది. అందుకు అనుగుణంగా ప్రజారవాణా సంస్థ అధికారులు ఏర్పాట్లు చేయక పోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. బస్సు ఎక్కడానికి పాట్లు తప్పలేదు. - న్యూస్‌టుడే, నరసరావుపేట టౌన్

గోపాలరావుకు రంగస్థల పురస్కారం ప్రదానం

తెనాలి: రంగస్థల పౌరాణిక నటులు విజయనగరం జిల్లా మందరాడకు చెందిన యడ్ల గోపాలరావుకు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారం ప్రదానం చేశారు. ఆదివారం రాత్రి తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి కళల కాణాచి ఉపాధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహించారు. కళల కాణాచి గౌరవాధ్యక్షుడు బాబు ఆర్. వడ్లమూడి, ముఖ్య సలహాదారు మునగాల శ్యాంప్రసాద్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆర్.ఆర్.గ్రూపు సంస్థల ఛైర్మన్ ఆర్.శ్రీకాంత్‌రెడ్డి, పట్టణ రంగస్థల అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, వేదగంగోత్రి ఫౌండేషన్ (విజయవాడ) వ్యవస్థాపక అధ్యక్షుడు బీవీఎన్ ఆర్‌ఎస్‌ఎస్ఎస్ వరప్రసాద్, కళల కాణాచి వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్రా సాయిమాధవ్ పురస్కారాన్ని గోపాలరావుకు ప్రదానం చేసి సత్కరించారు.

బండ్లమ్మ సన్నిధిలో నరసరావుపేట ఎంపీ

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు శ్రీబండ్లమ్మ అమ్మవారిని విజయదశమి సందర్భంగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ శనివారం సందర్శించారు. ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు పూర్ణాహుతి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వేగేశన మాట్లాడుతూ అమ్మవారి ఆలయంలోని సిమెంటు సింహాల స్థానంలో నూతనంగా రాతి పీఠం, పంచ లోహాలతో సింహాలు సొంత ఖర్చుతో తయారు చేయించి అమ్మవారికి సమర్పిస్తామన్నారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు దంపతులను ఆలయ అధికారులు సన్మానించి, అమ్మవారి చిత్రపటం, పండ్లు అందజేశారు.



ఎంపీ దంపతులకు పండ్లు అందిస్తున్న ఈవో నరసింహామూర్తి

వైకుంఠపురం ఆలయ సందర్శన

అమరావతి: వైకుంఠపురం వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని లీడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆయన వెంట తెదేపా నేతలు కోటేశ్వరరావు, వెంకట్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

తెదేపా జిల్లా అధ్యక్షుడికి సోదర వియోగం



శ్రీనివాసరావు (పాత చిత్రం)

పెదకూరపాడు, న్యూస్‌టుడే: తెదేపా పల్నాడు జిల్లా అధ్యక్షుడు, పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌కు సోదర వియోగం కలిగింది. తన రెండో సోదరుడు శ్రీనివాసరావు కొంత కాలంగా దీర్ఘ కాలిక వ్యాధితో బాధపడుతూ దసరా పండగ రోజున మృతిచెందారు. మృతదేహానికి స్వగ్రామం పెదకూరపాడులో అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, గుంటూరు మిర్చి యార్డు మాజీ ఛైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, రాష్ట్ర టూరిజం బోర్డు సభ్యుడు కుర్రా అప్పారావు, తెదేపా జిల్లా కార్యదర్శి అర్తిమళ్ల రమేష్, నందిగం ఆశీర్వాదం, మల్లాది విష్ణు, షేక్ భాష, బెల్లంకొండ షరీఫ్, జనసేన నేతలు మల్లెల చలపతి రావు, సుదా సాంబశివరావు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

సత్తెనపల్లి: రాష్ట్రాభివృద్ధిలో ప్రవాస భారతీయులు భాగస్వాములు కావాలని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెల శివరామ్ కోరారు. లండన్‌లోని తెదేపా కార్యకర్తలు ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘురామ్, ఎన్టీఆర్, కోడెల శివప్రసాదరావు, లగడపాటి అంబరీషు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఏపీ సర్వతోముఖాభివృద్ధికి సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో తెదేపా ఎన్నారై విభాగాన్ని మరింత బలోపేతం చేద్దామని చెప్పారు. ఎన్నారై తెదేపా నాయకులు శ్రీనివాసరావు, రామకోటయ్య, రాణా, జయకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ ఉచిత శిక్షణ

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో తరగతులు నిర్వహిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 21లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్ష ద్వారా శిక్షణ అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. అభ్యర్థుల కుటుంబ ఆదాయం రూ. 2.5లక్షల లోపు ఉండాలని తెలిపారు. http://jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27వతేదీ పరీక్ష ఉంటుందన్నారు. మెరిట్ జాబితా 28న వెల్లడిస్తారన్నారు. జిల్లాల వారీగా జాబితా అక్టోబరు 30న, కోచింగ్ కేంద్రాల వారీగా జాబితా నవంబరు 3న ప్రకటిస్తారని తెలిపారు. ఎంపికైన వారికి నవంబరు 6వతేదీ నుంచి మూడు నెలల పాటు వసతితో కూడిన శిక్షణ ఉంటుందని వివరించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, రిటైల్ ధర - 157, చికెన్ విత్‌స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 268 చికెన్ స్కిన్‌లెస్ - 278.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్య & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.98/-.

19న మెగా జాబ్‌మేళా

చిలకలూరిపేట గ్రామీణ: నియోజకవర్గంలోని నిరుద్యోగుల కోసం ఈ నెల 19న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం తెలిపారు. చిలకలూరిపేట ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఉదయం 9గంటల నుంచి జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు. 2016 -24 మధ్య 10, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఎంటెక్ చేసిన వారంతా అర్హులేనన్నారు.

ఆర్చి నిర్మాణానికి శంకుస్థాపన

వినుకొండ: స్టేట్‌బ్యాంక్ బజారులో ఎన్టీఆర్ పేరుతో నిర్మిస్తున్న ఆర్చికి శనివారం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శంకుస్థాపన చేశారు. నిర్మాణానికి స్వచ్ఛందంగా స్థానికులు విరాళాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ 2016లోనే ఆర్చి నిర్మాణానికి పురపాలక సంఘం అనుమతి ఇచ్చినట్లు గుర్తు చేశారు. కౌన్సిలర్ బ్రహ్మయ్య, రాధాకృష్ణమూర్తి, శివారెడ్డి, చిన్నగుర్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

కూటమి ప్రభుత్వంతోనే ఆర్టీసీ అభివృద్ధి

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట): ఆర్టీసీ అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. స్థానిక డిపోలో మూడు అల్ట్రా డీలక్స్ బస్సులను ఆదివారం ఆయన ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 17 నూతన బస్సులు నరసరావుపేట డిపోకు కేటాయించారన్నారు. డీపీటీవో ఎన్వీ శ్రీనివాసరావు, డీఎం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.


బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

నేటి నుంచి 'పల్లె పండుగ'

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: గ్రామసభల నిర్వహణ ఫలితం.. పల్లెకు మంచి రోజులు వస్తున్నాయి. సోమవారం నుంచి పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే డ్వామా అధికారులకు రాష్ట్ర అధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చాయి. ఆగస్టు 24న జిల్లా వ్యాప్తంగా ఒకేసారి 525 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించిన విషయం తెలిసిందే. వాటికి అన్ని చోట్లా మంచి స్పందన లభించింది. గ్రామానికి ఏయే పనులు కావాలి, వాటికి ఎంత నిధులు అవసరం.. ఉపాధిహామీ పథకంలో ఎన్నింటికి.. ఎంత ప్రతిపాదనలు పెట్టాలి. తదితర అంశాలపై ప్రజలు మధ్య చర్చ జరిగేలా సభలు సాగాయి. ఫలితంగా కేంద్రం నుంచి జిల్లాకు ఉపాధి పథకం కింద నిధులు కేటాయించారు. నియోజకవర్గాల వారీగా కేటాయించే నిధులను బట్టి వెంటనే సీసీ డ్రెయిన్లు, బీటీ రోడ్లు, గ్రావెల్, సీసీ, డబ్ల్యూబీఎం రోడ్ల పనులకు నిధులు కేటాయించారు. పంచాయతీరాజ్ అధికారులు, శాసనసభ్యులు సూచనలు తీసుకుని మండలాల వారీగా నిధులు కేటాయించారు. నిధుల కేటాయింపు వారీగా గ్రామాల్లో చేపట్టే పనులు గుర్తించి ఆమోదించారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద నియోజకవర్గానికి రూ.7.85 కోట్లు మంజూరు చేశారు. రొంపిచర్ల మండలంలో 28 పంచాయతీల పరిధిలో 39 పనులను రూ.4.28 కోట్లతో, నరసరావుపేట మండలంలో 27 పంచాయతీల పరిధిలో 36 పనులను రూ.3.57 కోట్లతో చేపట్టాలని నిర్ణయించారు.


ఇలాంటి రోడ్లకు మహర్దశ

కరిగిన నిధులు.. కనుమరుగైన మొక్కలు

గత వైకాపా ప్రభుత్వం జగనన్న కాలనీల్లో పచ్చదనం పెంపు కోసం ఉపాధిహామీ పథకం కింద నాటామని చెప్పిన మొక్కలు మచ్చుకైనా కనిపించడం లేదు. నిర్వహణ లేక ఎండిపోయాయని పర్యవేక్షణాధికారులు చెబుతున్నారు. నిధులు వృథా తప్ప పచ్చదనం కానరావడం లేదు.

న్యూస్‌టుడే, వినుకొండగ్రామీణ

వినుకొండ నియోజకవర్గంలోని వినుకొండ, నూజెండ్ల మండలాల్లో మూడేళ్ల కిందట జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వాటిల్లో వనాలు పెంచుతామని చెప్పి ఆర్భాటంగా మొక్కలు నాటారు. వినుకొండ మండలాన్నే తీసుకుంటే ఐదు లేఔట్లలో 9200 మొక్కలు నాటారు. ఒక్కొక్కటి కొనడానికి రూ.100 చొప్పున రూ.9.20 లక్షలు ఖర్చయింది. ఒక్కొక్క మొక్క నాటడానికి, గుంత తీయడానికి రూ.75 వంతున రూ.6.90 లక్షలు ఖర్చు చేశారు. తర్వాత వాటి నిర్వహణ పట్టించుకోలేదు. అప్పట్లో ఒక్కో మొక్క సంరక్షణకు మరికొంత ఖర్చు చేశారు. కంచెకు మాత్రం ఆరు నెలలకు ఒకసారి రెండు విడతలుగా అధికారులు మరికొంత అందజేశారు. తీరా చూస్తే నిధుల దుర్వినియోగమే తప్ప ఎలాంటి ఉపయోగం లేదు. ఒక్కచోటా కూడా మొక్కలు బతికించ లేదు. ఉన్నతాధికారులు పర్యవేక్షించి ప్రజాధనం దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


మొక్కల ఆనవాళ్లు లేని వినుకొండ జగనన్న కాలనీ దారి

పరిశీలించి చర్యలు

మండల పరిధిలో మొక్కలు ఎక్కడెక్కడ నాటారో తెలుసుకుంటాం. నిధులు ఎంత వెచ్చించారు. నిర్వహణ ఎలా ఉంది. ఎండిన మొక్కల వివరాలు ఉన్నతాధికారులకు తెలియజేస్తా.

- నాగేశ్వరరావు, ఏపీవో వినుకొండ

మసీదు నిర్మాణం ఎప్పటికి పూర్తయ్యేనో?

న్యూస్‌టుడే, నరసరావుపేటసెంట్రల్

నరసరావుపేటలో జామీయా మసీదు నిర్మాణ పనులు ప్రారంభించి మూడేళ్లు పూర్తవుతున్నా నత్తనడకన సాగుతున్నాయి. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పనులు సజావుగా సాగలేదని పలువురు ముస్లింసోదరులు ఆరోపిస్తున్నారు. మసీదు నిర్మాణం పక్కనే 72 దుకాణాలు ఏర్పా చేయనున్నారు. అందులో 26 షాపుల పనులు స్లాబు దశకు చేరుకోగా మిగిలిన 46 నిర్మాణాల పనులు ఇనుప చువ్వలకే పరిమితమయ్యాయి. ఈ మసీదును తొలగించక ముందు ప్రతి శుక్రవారం 200 మంది పైనే ప్రార్థనలు చేస్తుంటారు. దీనిని తొలగించాక తాత్కాలిక మసీదులో 50 మందికి మించి ప్రార్థనలు చేసుకునే అవకాశం లేక ముస్లిం సోదరులు ఇబ్బందులు పడుతున్నారు.


నిర్మాణంలో జామీయా మసీదు

రూ. 3.10 కోట్లతో ప్రతిపాదనలు: రూ.3.10 కోట్లతో 2021 అక్టోబరు 15న శంకుస్థాపన చేసిన మసీదు నిర్మాణానికి తర్వాత పనుల్లో జాప్యం చోటచేసుకుంది. మూడేళ్లవుతున్నా పనులు పూర్తికాకపోవడంపై ముస్లిం సోదరులు పెదవి విరుస్తున్నారు.

దాతల విరాళాలకు లెక్క లేవి : మసీదుతో పాటు షాపుల నిర్మాణానికి దాతల నుంచి విరాళాలు సేకరించారు. అవి ఎంత, ఎలా ఖర్చు చేశారన్నది తెలియటంలేదని, ప్రభుత్వం నుంచి ఎంత మంజూరైంది వంటి వివరాలు గోప్యంగా ఉంచుతున్నట్లు కమిటీ సభ్యులే ఆరోపిస్తున్నారు. దాతల నుంచి సేకరించిన విరాళాలకు లెక్కలు చెప్పాలని లేదా వివరాలతో కూడిన బోర్డు అయినా ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.


స్లాబులకే పరిమితమైన దుకాణాలు

విరాళాల లెక్కలపై ఫిర్యాదు

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి అనుచరులు రూ.3.10కోట్ల అంచనాలతో చందాలు వసూలు చేసి మసీదు నిర్మాణం పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నారని, అంజుమన్ స్థలంలో షాపులు నిర్మిస్తామని రూ.56 లక్షలు వసూలు చేసి వాటిని నిర్మించడం లేదని, జమాఖర్చులు చూపడం లేదని, వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు ముస్లిం పెద్దలు గత నెలలో ఎస్పీకి ఫిర్యాదు చేయడం గమనార్హం.

విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం


మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఒప్పంద కార్మికులు

నరసరావుపేట సెంట్రల్: కారణంగా లేకుండా మున్సిపల్ ఒప్పంద కార్మికులు, ఉద్యోగులను విధులను తప్పించడం సరైన విధానం కాదని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షులు సిలార్‌మసూద్ అన్నారు. 12 రోజులుగా కార్మికులు ఆందోళన చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులకు పట్టడం లేదన్నారు. ఒప్పంద కార్మికులను విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం ఆగదని, జిల్లాస్థాయిలో ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నామని చెప్పారు. కార్మికులపై రాజకీయ కక్ష చూపడం సమంజసం కాదని, వెంటనే వారికి ఇవ్వాల్సిన రెండు నెలల జీతాలు ఇచ్చి విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రజా సంఘాల నాయకులు మొహిద్దీన్‌బాషా, వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, ఏడుకొండలు, కందిమళ్ల కృష్ణ, శ్రీనివాసరావు, బాషా, సుబానిలు ఆందోళనకు మద్దతు తెలిపారు.

మనుషులు- మానవత్వంపై సదస్సు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: రోజురోజుకు మానవ సంబంధాలు సన్నగిల్లిపోతున్నాయని, ఇది చాలా ప్రమాదమని గ్రహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీవరప్రసాద్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు భాగవతుల రవికుమార్ అన్నారు. దసరా సందర్భంగా వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమంలో మనుషులు-మానవత్వం అంశంపై సెమినార్ నిర్వహించారు. గుమ్మడి ఆశ్రమంలో వృద్ధుల ఆలనా, పాలనా చూస్తుంటే ఇంకా మానవత్వం ఉందనిపిస్తుందన్నారు. గుమ్మడిని పలువురు సన్మానించగా ఆశ్రమ నిర్వాహకులు అతిథులను సత్కరించారు.


కవి కరిముల్లాకు అవార్డు

వినుకొండ, న్యూస్‌టుడే: వినుకొండ చెందిన ఉపాధ్యాయుడు, కవి కరిముల్లాకు రాష్ట్ర నూర్‌బాషా ఉద్యోగుల సంఘం ఏపీజే అబ్దుల్‌కలాం అవార్డు ఇచ్చి సత్కరించింది. ప్రొద్దుటూరులో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్ఞాపిక అందజేశారు. సాహిత్యంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన సృష్టించిన అబాబీలు కవితా ప్రక్రియ ఆకట్టుకుంది. అవార్డు అందించిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.సిద్ధయ్య, ప్రధాన కార్యదర్శి ధర్మారం బాజి, విశ్రాంత డీఎస్పీ మహబూబ్ బాషా, లాల్‌వజీర్, ఖాదర్ తదితరులున్నారు.


కవి కరిముల్లాను సత్కరిస్తున్న నూర్‌బాషా ఉద్యోగుల సంఘం నేతలు

రాజశ్యామల యాగంతో సుభిక్షం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: రాజశ్యామల యాగంతో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. విఠంరాజుపల్లిలోని శాంతి ఆశ్రమంలో హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో విజయదశమి రోజున మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. లోక కల్యాణార్థం ఇలాంటి యాగాలు పెద్దఎత్తున నిర్వహించడం అభినందనీయమన్నారు. గురూజీ 10 రోజుల పాటు మౌన వ్రతం పాటించి చేసిన విశేష పూజలతో రాష్ట్రం సుభిక్షమన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ రాజశ్యామల యాగంలో పాల్గొనే అవకాశం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. గురూజీ ఈ ప్రాంతానికి వచ్చినప్పటి నుంచి ఇక్కడ కరవు కాటకాలు తగ్గాయని, భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. యాగానికి హిమాలయ గురూజీ మహా పూర్ణాహుతి ఇచ్చి ఇద్దరిని సత్కరించారు. కార్యక్రమంలో జీవీ రమణ, యెండ్లూరి కిషోర్, రెడ్డి వెంకటరత్నం, పత్తి పూర్ణ, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.


హోమగుండంలో ద్రవ్యాలు వేస్తున్న ఎమ్మెల్యే జీవీ, మక్కెన

తెలుగుతల్లి విగ్రహ స్థలంపై కబ్జాదారుల కన్ను

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: పట్టణంలోని అండర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన తెలుగు తల్లి విగ్రహం తొలగించడంపై చర్చ నడుస్తోంది. తెలుగు తల్లి విగ్రహం ఉన్న ప్రాంతంపై కొందరు అధికార పార్టీ నాయకులు కన్నేశారు. ఈ విగ్రహం ఉన్న ప్రాంతాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. స్థలం కబ్జా చేసి దుకాణాలు లీజుకు ఇచ్చేందుకు ఇప్పటికే ఓ నాయకుడు కేవీఆర్ కాంప్లెక్స్ ముట్ట తోపుడు బండ్ల వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. మీకు మున్సిపాలిటీ నుంచి ఇబ్బంది లేకుండా ఉండాలన్నా, తెలుగు తల్లి విగ్రహం ఉన్న ప్రాంతంలో దుకాణాలు పెట్టుకోవాలన్నా ముందు డబ్బులు ఇవ్వాలని హుకుం జారీ చేసి వసూళ్లకు పాల్పడుతున్నాడు. తెలుగు తల్లి విగ్రహం తొలగింపుపై మున్సిపల్ కమిషనర్ జస్వంతరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఎవరూ అనుమతి అడగలేదన్నారు.


తెలుగు తల్లి విగ్రహం తొలగించిన తర్వాత దిమ్మె ఇలా..

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156

యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

మల్లమ్మసెంటర్: ? బరంపేట చాకిరాలమిట్ట రెండో వీధిలో దీపాల వెలగడం లేదు. **-వెస్లీ, స్థానికుడు**

✔ సిబ్బందితో సమస్య పరిష్కరిస్తాం. **-శేఖర్, వీధి దీపాల నిర్వహణాధికారి**

? నరసరావుపేట డీఎస్పీ బంగ్లాకు వెళ్లే దారిలో రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయి. **-మణికంఠ, వాహనచోదకుడు**

✔ స్థానిక అధికారికి తెలిపి గుంతలు పూడ్పించేలా చర్యలు తీసుకుంటాం. **-స్వర్ణరాజు, మున్సిపల్ ఏఈ**

వినుకొండ గ్రామీణ: ? కాలువలు వ్యర్థాలతో నిండి మురుగు ముందుకు కదలడం లేదు. **- పెదకంచర్ల ఎస్సీ కాలనీవాసులు**

✔ ప్రస్తుతం కార్యదర్శి బదిలీ అయ్యారు. వెంటనే సిబ్బందిని పంపి పూడిక తీయిస్తాం. **-సుందరరెడ్డి, ఈవోపీఆర్డీ, వినుకొండ**

? ఎస్సీ కాలనీలో ఒక లైనుకు రెండు నెలల క్రితం విద్యుత్తు తీగ తప్పించి ఇప్పటి వరకు కలపలేదు. చీకట్లోనే ఉంటున్నాం. **- కాలనీవాసులు, చాట్రగడ్డపాడు**

✔ సిబ్బందిని పంపి విద్యుత్తు పునరుద్ధరిస్తాం. **-శ్రీనివాసరావు, ఏడీఏ, వినుకొండ**

రహదారులపై గుంతలు

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేటలో పలు రహదారుల మధ్యలో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. పట్టణంలోని రామిరెడ్డిపేట నుంచి పాలపాడు వెళ్లే మలుపు వద్ద రోడ్డుకు రంధ్రం పడింది. పాతూరులోని శ్రీరస్తు ఫంక్షన్ హాలు సమీపంలో రోడ్డుపై గుంత ఏర్పడింది. అలాగే శివుని బొమ్మ వద్ద నుంచి బరంపేట వెళ్లే దారిలో పలుచోట్ల మ్యాన్‌హోళ్లపై మూతలు భూమిలోకి కుంగిపోతున్నాయి. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.


రామిరెడ్డిపేట నుంచి పాలపాడు వెళ్లే మార్గంలో గుంత

రాష్ట్ర రహదారిపై పచ్చదనం పరవశం



వినుకొండ-ఒంగోలు రాష్ట్ర రహదారిలో వినుకొండ పట్టణ సరిహద్దు నుంచి కొటప్పనగర్ వరకు సుమారు కిలోమీటరు పొడవున వృక్షాలు రహదారిని కప్పేసినట్లు నీడనిస్తున్నాయి. మండు వేసవిలోనూ బాటసారులు ఇక్కడ చెట్ల నీడన కాసేపు ఆగి సేదతీర్చుకుంటుంటారు. ఇటీవల వర్షాలకు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

–న్యూస్‌టుడే, వినుకొండ

రూ.లక్షలు వెచ్చించారు.. నిరుపయోగంగా ఉంచారు

శావల్యాపురం, న్యూస్‌టుడే: విద్యుత్తు సరఫరా లేని సమయంలో ప్రజలకు అందించే సేవల్లో అంతరాయం లేకుండా ప్రభుత్వ కార్యాలయాలకు రూ.లక్షలు వెచ్చించి జనరేటర్లు ఏర్పాటు చేశారు. సుమారు పదేళ్ల కిందట శావల్యాపురం తహసీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జనరేటర్లు వృథాగా ఉన్నాయి. వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ తుప్పుపడుతున్నాయి.


తహసీల్దారు కార్యాలయం వద్ద వృథాగా జనరేటర్

అందుబాటులోకి స్కాన్ సెంటర్

నరసరావుపేట అర్బన్: పట్టణంలోని నిమ్మతోటలో ఆదివారం రాంప్రసాద్ స్కాన్ సెంటర్‌ను ప్రారంభించారు. దీనికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య హాజరయ్యారు. పూజాధికాలను నిర్వాహకులు డాక్టర్ రాంప్రసాద్, మాధవీలత దంపతులు నిర్వహించారు. ఐఎంఏ నేతలు డాక్టర్ నాగోతు ప్రకాశ్‌రావు, శ్రీనివాసరెడ్డి, ప్రముఖ వైద్యులు కడియాల వెంకటేశ్వరరావు, కారసాని శ్రీనివాసరావు, అన్నె రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ లావు, ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

స్టేషన్ రోడ్డులో గుంతలు పూడ్చండి

వినుకొండ రైల్వే స్టేషన్ రోడ్డు గుంతల మయంగా మారింది. ఏనుగుపాలెం రోడ్డు గేటు నుంచి స్టేషన్‌కు వెళ్లాలంటే ప్రారంభంలోనే తారు రోడ్డుకు గుంతలు పడి వర్షపునీరు నిలబడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రైల్వే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, వినుకొండ



సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

వినుకొండ, న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పంపిణీ చేశారు. ఆయన కార్యాలయంలో గాదె చినకొండయ్య (నాగులవరం), భూక్యా కోటినాయక్ (అగ్నిగుండాల) రావెళ్ల హనుమాయమ్మ (కారుమంచి) పి.ఆయూబ్ ఖాన్(వినుకొండ)లకు రూ.7.61లక్షల చెక్కులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, తెదేపా నేతలు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం ప్రారంభం

చిలకలూరిపేట గ్రామీణ: చిన్నపసుమర్రు పరిధిలో ఓగేరువాగుకు దక్షిణాన ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో మాలాధారణ ధరించిన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఆలయ కమిటీ అధ్యక్షులు వెలంపల్లి రవిశంకర్, పోలూరి పాండురంగారావు, డాక్టర్ అర్వపల్లి సురేష్ కుమార్, పసుమర్తి రామ్మూర్తి, సుబ్రహ్మణ్యం, జగన్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: పట్టణ పోలీస్ స్టేషన్‌లో విజయదశమి సందర్భంగా సీఐ శోభన్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్టేషన్‌లో ఆయుధ పూజ చేశారు. ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు

శావల్యాపురం, న్యూస్‌టుడే: పోట్లూరు పంచాయతీలో వీధి దీపాలు వెలగడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. వర్షాలు కురుస్తుండడం, రోడ్డు వెంబడి ముళ్లపొదలు పెరిగిపోయి ఉండటం, విష సర్పాలు సంచరిస్తున్నాయని చెబుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కనీసం వీధి దీపాలు వెలిగేలా చూడాలని కోరుతున్నారు.

వజ్రాభరణాల షోరూం ప్రారంభం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా పట్టణంలో స్వా డైమండ్స్ షోరూంను శనివారం ప్రారంభించారు. ఏపీ రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయ్‌కుమార్ నిర్వహిస్తున్న కేవీకే జ్యూయలర్స్ 50 వసంతాల వేడుక సందర్భంగా ప్రత్యేక వజ్రాభరణాల షోరూంను ప్రారంభించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథులుగా హాజరై వివిధ విభాగాలను ప్రారంభించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సుబ్బరాయగుప్తా తదితరులు పాల్గొన్నారు.


షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు, పక్కన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నాగమ్మ మృతి పార్టీకి తీరని లోటు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి నాగేశ్వరరావు సతీమణి, సీపీఐ నేత నాగమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా పార్టీ కార్యదర్శి ఎ.మారుతివరప్రసాద్, చిలకలూరిపేట సీపీఐ ఇన్‌ఛార్జి కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ ఆదివారం వేలూరు గ్రామానికి వెళ్లి నాగమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. నాగమ్మ మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని ముప్పాళ్ల పేర్కొన్నారు.

కార్మికుడి ఆత్మహత్య

గణపవరం (నాదెండ్ల): గణపవరానికి చెందిన రైస్ మిల్లు కార్మికుడు షేక్ జానీబాషా (46) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం. . చవిటిపాలేనికి చెందిన ఇతను గతంలో హోటల్ నిర్వహించాడు. వ్యాపారం సాగకపోవడంతో చిలకలూరిపేట రైస్ మిల్లులో పనిచేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికి తోడు కుటుంబ కలహాలు కుంగదీశాయి. ఈ నెల 11న విషం తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాదెండ్ల పోలీసులు తెలిపారు.

వైభవంగా విజయదశమి వేడుకలు


పాతూరులో రాజరాజేశ్వరి అలంకారంలో పార్వతీదేవి


రామిరెడ్డిపేటలో బాలచౌడేశ్వరి


అరండల్‌పేట సత్యసాయి మందిరంలో


రాజరాజేశ్వరీగా రొంపిచర్ల వాసవీ అమ్మవారు


నీలంపాటి శ్రీలక్ష్మీఅమ్మవారు


వినుకొండ: కన్యకాపరమేశ్వరీ ఆలయంలో..


శనీశ్వర ఆలయంలో శాంతస్వరూపిణిగా..


పాతూరు భీమలింగేశ్వరాలయంలో శమీపూజ

దసరా నవరాత్రులు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. విజయదశమి రోజున రాజరాజేశ్వరీ అలంకరణలో కనువిందు చేశారు. పలుచోట్ల మహిళలు కోలాటంతో సందడి చేశారు.

- న్యూస్‌టుడే, బృందం


అంకాలమ్మ తల్లి ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు


జగన్మాత పీఠంలో రాజరాజేశ్వరిగా..


జడ్డావారిపాలెంలో అలంకరణ


గంటావారిపాలెంలో రాజరాజేశ్వరిదేవిగా..


చిలకలూరిపేట శారదాంబ దేవాలయంలో..


పసుమర్రు శివాలయంలో రాజరాజేశ్వరిగా అమ్మవారు


బొప్పూడి రేణుకాదేవి ఆలయంలో..


సొలసలోని ఆలయంలో..


చెంఘీజ్‌ఖాన్‌పేట పోలేరమ్మ ఆలయంలో..

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

నేడు మద్యం దుకాణాలకు లాటరీ

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : పిడుగురాళ్ల ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు నరసరావుపేటలోని ప్రకాష్‌నగర్‌లోని టౌన్‌హాలుకు సోమవారం ఉదయం 8గంటలకు రావాలని ఎక్సైజ్ సీఐ కె.కర్ణ తెలిపారు. మద్యం దుకాణాలకు డ్రా నిర్వహిస్తారని దరఖాస్తుచేసుకున్న వారు రావాలని కోరారు.

క్రోసూరు(అచ్చంపేట) న్యూస్‌టుడే: క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు మండలాల్లోని పది మద్యం దుకాణాలకు గాను 329 దరఖాస్తులు దాఖలు చేసినట్లు, దరఖాస్తు రుసుము కింద రూ.6.58 కోట్లు ఆదాయం లభించినట్లు సీఐ తులసి తెలిపారు. దరఖాస్తుదారులు సోమవారం నరసరావుపేటలో జరిగే లాటరీలో ఉదయం 8గంటలకు హాజరుకావాల్సిందిగా ఆమె కోరారు.

16న సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపిక పోటీలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో 16 నుంచి సత్తెనపల్లి మండలంలోని నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో సీనియర్ పురుషులు, మహిళల జట్ల ఎంపిక పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్ తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు వయసు నిర్ధారణకు ఆధార్ కార్డుతో హాజరవ్వాలని కోరారు.

రెండున్నర దశాబ్దాలుగా విద్యాభివృద్ధికి కృషి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : కార్డ్స్ సంస్థ రెండున్నర దశాబ్దాల నుంచి విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టరు తాళ్లూరి అమర్‌నాథ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని లెనిన్ నగర్‌లో కార్డ్స్ పాఠశాలలో బాలబాట ఆర్గనైజర్లకు సమావేశం నిర్వహించారు. సమావేశంలో న్యాయవాదులు రూత్‌బనియన్, యు.కోటేశ్వరరావు, పుష్పలత, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? లోయపల్లిలో రాత్రివేళల్లో ఒక వీధి నుంచి ఇంకొక వీధికి వెళ్లాలంటే వీధి దీపాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. -శివ, లోయపల్లి

✔ తొందర్లో వేయిస్తాం. -మాచర్లరూరల్, పంచాయతీకార్యదర్శి, లోయపల్లి

? శ్రీరాంపురం తండాలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగు నీరు నిలబడి దోమలకు ఆవాసాలుగా మారి, వ్యాధులు ప్రబలుతున్నాయి. -స్థానికులు, శ్రీరాంపురం తండా

✔ తొందర్లో మురుగు కాలువలు శుభ్రంచేయించి, ఫాగింగ్ చేయిస్తాం. -ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, శ్రీరాంపురంతండా -న్యూస్‌టుడే వెల్దుర్తి

కాల్వల మరమ్మతులకు రూ.40 కోట్లు

రెంటచింతల, న్యూస్‌టుడే : నియోజకవర్గంలో సాగర్ కాల్వల మరమ్మత్తులకు రూ.40 కోట్ల నిధులు మంజూరైనట్లు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తెలిపారు. స్థానిక తెదేపా నేత సన్నిగంటి సిద్దయ్య మాతృమూర్తి రామకోటమ్మ(82) ఆదివారం ఉదయం మృతిచెందింది. ఆమె మృతదేహానికి నివాళి అర్పించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అస్తవ్యస్తాల సంక్షేమాన్ని విస్మరించింది.. నాలుగు మండలాల్లో 40 పనులకు అంచనాలు రూపొందించగా రూ. 40 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. త్వరలో టెండరు పనులు పూర్తి చేసి మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. సోమవారం మాచర్లలో పట్ట భద్రులను ఓటర్లగా నమోదు చేసేందుకు సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజా సదస్సుకు హాజరవుతున్నారన్నారు.


రామకోటమ్మ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

దేవుడా.. ప్లాస్టిక్ నిషేధించయ్యా!

అమరావతి, న్యూస్‌టుడే



ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం అమరావతిలో ప్లాస్టిక్ నిషేధం అమలుకు నోచుకోవడం లేదు. రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించారు. గతంలో అమరావతిని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అప్పట్లో వ్యాపారులకు అవగాహన కల్పించారు. కాలక్రమేణా ఆ నిషేధాజ్ఞలు మరుగున పడిపోయాయి. ప్లాస్టిక్ వాడకం యథేచ్ఛగా సాగుతోంది.

పూజా సామగ్రితో ప్రవేశం

ప్రధానంగా అమరావతిలోని అమరేశ్వరాలయం, ధ్యానబుద్ధ ప్రాజెక్టు, మ్యూజియం పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడుతున్నారు. ఆలయానికి సంబంధించిన దుకాణాల్లోనూ వినియోగిస్తున్నారు. స్వామి పూజకు, అభిషేకానికి అవసరమైన కొబ్బరికాయలు, పూలు, అగరొత్తులు, ఆవు పాలు, ఆకులు, పండ్లు తదితరాలు ప్లాస్టిక్ సంచుల్లోనే భక్తులకు విక్రయిస్తున్నారు. ఆలయంలో భక్తులకు విక్రయించే లడ్డూ, పులిహోర కూడా ప్లాస్టిక్ సంచుల్లోనే ఇస్తున్నారు. గతంలో ప్రసాదాలను పర్యావరణహిత కవర్లలో ఉంచి విక్రయించేవారు. భక్తులు వదిలేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలతో అమరేశ్వరఘాట్, ధ్యానబుద్ధ ఘాట్లు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఇప్పటికైనా ఆలయ అధికారులు దృష్టి సారించి భక్తులకు అవగాహన కల్పించి, జనపనార సంచులు, కాగితపు గుజ్జు సంచులు, మట్టి పాత్రలు వాడేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.


అమరేశ్వరఘాట్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

వాడకాన్ని తగ్గిస్తాం

ఈ విషయమై ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపిని 'న్యూస్‌టుడే' వివరణ అడగ్గా ఇప్పటికే దేవస్థాన కేంద్రాల్లోని ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించామన్నారు. లడ్డూ ప్రసాదం కోసం ఎకో ఫ్రెండ్లీ సంచులను వాడతామన్నారు. ఆలయ దుకాణాల్లోనూ ప్లాస్టిక్ వాడకం తగ్గించి పర్యావరణహిత సంచులు వాడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కుమారస్వామికి పసిడి నేత్రాలు

అమరావతి, న్యూస్‌టుడే : అమరావతిలోని అమరేశ్వరాలయంలోని ఉపాలయంలోని షణ్ముఖ కుమారస్వామికి అమరావతికి చెందిన కోనూరు దేవిప్రసాద్, లక్ష్మీదేవి దంపతులు పసిడి నేత్రాలు బహూకరించారు. 8 గ్రాముల బంగారంతో చేసిన నేత్రాలను విజయదశమి రోజున ఈఓ వేమూరి గోపికి దేవీప్రసాద్ దంపతులు అందజేశారు.

తిరుగు ప్రయాణాలకు బస్సుల్లేక వెతలు

దసరా పండుగకు గ్రామాలకు వచ్చి తిరుగు ప్రయాణమైన ప్రజలు బస్సుల్లేక ఆదివారం ఇబ్బందులు పడ్డారు. గుంటూరు, విజయవాడ వెళ్లేందుకు గంటల తరబడి బస్సుల కోసం వేచిచూడాల్సి వచ్చింది. తాలుకా సెంటర్‌లో బస్సుల కోసం చాలా మంది ఎదురుచూశారు. -న్యూస్‌టుడే, సత్తెనపల్లి


తాలుకా సెంటర్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు


పెదమక్కెనలో రాజరాజేశ్వరి దేవిగా


వెల్దుర్తిలో బతుకమ్మకు పూజలు


మాచవరం వాసవీ మాత


బెల్లంకొండలో అపరాజితా దేవిగా


మోహిని అలంకారంలో.. దర్శనమిచ్చిన శ్రీవారు


శ్రీరాజరాజేశ్వరిదేవిగా నీలంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు


కన్యకాపరమేశ్వరి అమ్మవారు


చిగురుపాడులో అమ్మవారి ఊరేగింపు


కారంపూడిలో..


త్రిశక్తి దుర్గాపీఠంలో శ్రీరాజరాజేశ్వరిదేవి


శమీ వృక్షం కింద ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


మాచవరంలో భ్రమరాంబ అమ్మవారు


రూ.2లక్షల వ్యయంతో స్వామివారికి విరాళంగా ఇచ్చిన పల్లకి

జగద్రక్షిణి.. సకల శక్తి స్వరూపిణి

దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం సత్తెనపల్లి, మాచర్ల, గురజాల, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా పూజలందుకున్నారు. అనంతరం మహిళలు బతుకమ్మ పూజలు చేశారు. నిమజ్జనోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

–న్యూస్‌టుడే, బృందం


ఊరేగింపులో..


పెదకూరపాడులో వివిధ వేష ధారణలు


నిమజ్జనానికి బతుకమ్మలను తీసుకెళ్తున్న మహిళలు


జంగమహేశ్వరపురంలో..


పెదకూరపాడు బతుకమ్మ పూజల్లో మహిళలు


ఆకుల గణపవరంలో..

తోపుడు బండ్లు పంపిణీ

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: పులిపాడు గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని గురజాల తెదేపా మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీ నారాయణ అన్నారు. శనివారం గ్రామంలో ఆయన సొంత నిధులు రూ.60 వేలతో పేదలకు తోపుడు బండ్లు పంపిణీ చేశారు.

దాతల తోడ్పాటు అభినందనీయం

పెదకూరపాడు, న్యూస్‌టుడే: గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావటం అభినందనీయమని జిల్లా తెదేపా కార్యదర్శి అర్తిమళ్ల రమేష్ అన్నారు. స్థానిక తాగునీటి చెరువు ప్రాంగణంలో విలేజ్ పార్క్, శరీర దారుఢ్యానికి జిమ్ ఏర్పాటు చేసేందుకు పెదకూరపాడు గ్రామస్థుడు మహిత రియల్‌ఎస్టేట్ అధినేత పొట్టి నాగమల్లేశ్వరరావు ముందుకు వచ్చారు. ఆదివారం అభివృద్ధి పనునకు దాత పొట్టి నాగమల్లేశ్వరరావుపనులు ప్రారంభించారు.

విజేతలకు బహుమతుల అందజేత

అచ్చంపేట, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ పాఠశాల ఆవరణలో రెండు మండలాల స్థాయి దసరా క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు శనివారం సాయంత్రం బహుమతి ప్రదానం నిర్వహించారు. ప్రథమంగా నిలిచిన అచ్చంపేట సీనియర్స్ జట్టుకు, తెదేపా నాయకులు వెనిగండ్ల కోటయ్య రూ.20వేలు నగదు, షీల్డు , రెండో స్థానంలో నిలిచిన సన్‌రైజెస్ జట్టుకు కోటేశ్వరరావు, రూ.10వేలు నగదు, షీల్డు అందజేశారు.

జూనియర్ సివిల్ జడ్జికి సత్కారం

నకరికల్లు న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలు పురస్కరించుకొని మండలంలోని నరిసింగపాడులో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయాన్ని నల్గొండ జిల్లా దేవరకొండ జూనియర్ సివిల్ జడ్జి కేవీ హరీష్ బాబు శనివారం దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన జూనియర్ సివిల్ జడ్జికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి సత్కరించారు.

నేటి నుంచి మండలంలో పల్లె పండుగ

అచ్చంపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం నుంచి 19వరకు పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామాల్లో ఉపాధిహామీ నిధులతో చేపట్టబోయే పనులు ప్రారంభిస్తామని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శివనాగరాజు తెలిపారు. రెండు బృందాలు రోజుకు ఒక్కొక్క బృందంగా రెండు గ్రామాల చొప్పున గ్రామసభలు నిర్వహించి గుర్తించిన పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు.

మాచవరంపై.. మక్కువ

రెండు మద్యం దుకాణాలకు ౯౦ దరఖాస్తుల రాక

జిల్లాలో మొదటి రెండు స్థానాలు ఈమండలంలోనే

మాచవరం, న్యూస్‌టుడే : నూతన విధానంలో భాగంగా మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు ప్రభుత్వం లైసెన్సు దరఖాస్తులు ఆహ్వానించగా, మాచవరం మండలం నుంచి అనూహ్య స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా 129 దుకాణాలకు 2,639 దరఖాస్తులు అందగా, అందులో మాచవరంలోని రెండు దుకాణాలకు 90 దరఖాస్తులు వచ్చాయి. 84 నెంబరు దుకాణానికి 44, 85 నెంబరు దుకాణానికి 46 దరఖాస్తులు వచ్చి, జిల్లా వ్యాప్తంగా మొదటి రెండు స్థానాలు ఆక్రమించాయి. తరువాత స్థానాల్లో బొల్లాపల్లి, ఈపూరు మండలాలు ఉన్నాయి. మారుమూల ప్రాంతమైన మాచవరానికి ఎక్కడా లేని విధంగా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.

ఇక్కడే పోటీ ఎందుకంటే.. : మాచవరం మండలం తెలంగాణకు సరిహద్దు ప్రాంతం.. కృష్ణానదికి ఒక వైపు ఇటు ఉంటే, మరో వైపు చింత్రియాల(తెలంగాణ) ఉంది. రెండు ప్రాంతాల ప్రజల రాకపోకలకు గోవిందాపురం సమీపంలోని పడవుల రేవులో బల్లకట్టు తిరుగుతోంది. ఇక్కడ దుకాణాలు దక్కించుకునే వ్యాపారులు సిండికేట్‌గా మారి, ఊరికి రెండు, మూడు బెల్టుషాపులు ప్రోత్సహించే అవకాశం ఉంది. బెల్టులకు ఒక్కో సీసాపై రూ. 15-20ల వరకు అదనంగా తీసుకొని మద్యం సరఫరా చేస్తుంటారు. దీనికి తోడు అధీకృత మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘించి మద్యం అమ్మకాలు చేస్తుంటారు. దాంతో ప్రభుత్వం ఇచ్చే 20శాతం మార్జిన్‌తో పాటు అదనంగా మరో 10శాతం వచ్చి చేరనుంది. దాంతో లాభాలు విపరీతంగా వచ్చే అవకాశం ఉండటంతో అందరి చూపు మాచవరంపై పడింది. అదే విధంగా తెలంగాణలో కంటే ఆంధ్రాలో మద్యం ధరలు తగ్గితే ఆ ప్రభావం ఇక్కడ పడనుంది. ప్రస్తుతం తెలంగాణ మద్యాన్ని అక్రమంగా దిగుమతి చేసుకుంటుంటే, నేడు ఆంధ్రా మద్యాన్ని తెలంగాణకు తీసుకువెళ్లే అవకాశం ఉంటుంది. దాంతో తెలంగాణకు చెందిన వ్యక్తులు ఇందులో పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ముప్పాళ్ల, న్యూస్‌టుడే : మండలంలోని గోళ్లపాడులో 2004- 05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు దసరా పండుగ రోజు పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. తాము చదువుకున్న పాఠశాలలో సమావేశమై పరస్పరం యోగక్షేమాలు ఆరా తీసుకున్నారు. తమ ఉన్నతికి దోహదపడిన గురువులను సత్కరించారు.


గోళ్లపాడులో

బెల్లంకొండ, న్యూస్‌టుడే : బెల్లంకొండ చిట్టిప్రోల్ కాశమ్మ జిల్లా పరిషత్ హై స్కూల్ 2005- 2006 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.


బెల్లంకొండలో..

సేవకు మారుపేరు భానుప్రకాష్

పెదకూరపాడు, అచ్చంపేట, న్యూస్‌టుడే: మాతృ భూమిపై ఉన్న అభిమానంతో పేద ప్రజలకు విద్య, వైద్యానికి అండగా నిలుస్తున్న భానుప్రకాష్ సేవలు అభినందనీయమని జిల్లా తెదేపా కార్యదర్శి అర్తిమళ్ల రమేష్ అన్నారు. హుస్సేన్ నగరం గ్రామానికి చెందిన ఎన్నారై మాగులూరి భానుప్రకాష్ జన్మదిన వేడుకలు పెదకూరపాడు మాగులూరి ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అచ్చంపేటలోకూడా భానుప్రకాష్ పుట్టినరోజు వేడుకలు జరిగాయి.


ఎన్నారై భానుప్రకాష్ జన్మదిన వేడుకల్లో నేతలు

జనసేన నియోజకవర్గ కార్యాలయ ఇన్‌ఛార్జిపై దాడికి యత్నం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : తనపై కత్తి, చేతిపిడిలతో దాడికి యత్నించారని జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయ ఇన్‌ఛార్జి శిరిగిరి మణికంఠ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అచ్చంపేట రైల్వేగేటు వద్ద స్నేహితులతో శనివారం సాయంత్రం మణికంఠ ఉన్న సమయంలో పట్టణానికి చెందిన బూరి పవన్, కిశోర్ అనే వ్యక్తులు వచ్చి ఆయనపై దాడికి యత్నించారు. వెంటనే పోలీసులకు మణికంఠ ఫిర్యాదు చేయడంతో సీఐ బ్రహ్మయ్య అక్కడకు చేరుకుని పవన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఆశ్రమంలో విగ్రహాల ఏర్పాటు


విగ్రహాలు ప్రారంభిస్తున్న అతిథులు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే : వివేకానంద సేవాశ్రమంలో జాతీయ ప్రముఖుల విగ్రహాలను శనివారం ఆవిష్కరించారు. ఆశ్రమంలో గాంధీ, సర్వేపల్లి రాధాకృష్ణ, మదర్‌థెరీసా, వివేకానంద, అబ్దుల్‌కలాం విగ్రహాలను ఏర్పాటు చేయగా నిర్వాహకుడు గోవిందారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామకృష్ణ, ప్రతిభ, లక్ష్మీనారాయణ, శర్మ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దేవస్థానానికి భూమిపూజ

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని చర్లగుడిపాడులో నూతనంగా అయ్యప్ప స్వామి దేవస్థానానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారి బండ్ల లక్ష్మణ్ పాల్గొన్నారు. ఆయనకు గ్రామ పెద్దలు స్వాగతం పలికారు. కార్యక్రమంలో అయ్యప్పలు, మద్దినేని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కారు అదుపుతప్పి ఒకరికి గాయాలు

దాచేపల్లి : గామాలపాడు సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. దాచేపల్లి వైపు నుంచి జాతీయ రహదారిపై హైదారబాద్ వైపు వెళ్తున్న ఓ కారు గణపతి కోల్ట్ స్టోరేజ్ వద్దకు చేరుకోగనే అకస్మాత్తుగా రోడ్డుపైకి ఓ గేదె రావడంతో దానిని తప్పించబోయి పక్కనే ఉన్న తోపుడు బండిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఓ వ్యక్తికి స్వల్పగాయాలు అయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ఇకపై నిరంతర విద్యుత్తు

గురజాలకు తొలగిన సమస్య

గురజాల, న్యూస్‌టుడే

గురజాల నగర పంచాయతీ పరిధిలో విద్యుత్తు కష్టాలు తొలగిపోయాయి. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన గురజాలకు అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలన్న అధికారుల కృషికి ఫలితం దక్కింది. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చొరవతో మార్గం సుగమం అయ్యింది. గురజాలతోపాటు దైద, పులిపాడు సబ్‌స్టేషన్‌లకు నిరంతరం సరఫరా చేసేలా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేశారు. రూ. 11 లక్షల వ్యయంలో కొత్తగా విద్యుత్తు లైన్ ఏర్పాటు చేశారు.

ప్రత్యామ్నాయ మార్గం

ఇప్పటి వరకు గురజాల, పులిపాడు, దైద సబ్‌స్టేషన్‌లకు మాచర్ల నుంచి 33 కేవీ విద్యుత్తు లైను ద్వారా కరెంటు సరఫరా అవుతోంది. సుమారు 30 కిలోమీటర్ల దూరం లైను ఉండటంతో తరచూ ఇబ్బందులు నెలకొంటున్నాయి. కొన్ని సందర్భాల్లో గంటల తరబడి సరఫరా నిలిచిపోతోంది. గాలికి, వర్షాలకు విద్యుత్తు ఆగితే.. మాచర్ల నుంచి లైను చూసుకుంటూ రావాల్సి వస్తుంది. దీనివల్ల గంటల తరబడి పునరుద్ధరించలేకపోతున్నారు. సిబ్బంది సైతం వర్షానికి ఇబ్బందిపడుతూ వచ్చారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపుతూ.. కారంపూడి మండలం నరమాలపాడు నుంచి వస్తున్న 33 కేవీ లైనును గురజాల వరకు పొడిగించారు. ఈ లైను అంజనాపురం మీదుగా షుగర్ ఫ్యాక్టరీ వద్ద గల రైల్వే ట్రాక్‌ను దాటుకుంటూ గురజాల లైనుకు కలిపారు. ఈ పనులకు రూ. 11 లక్షలు వెచ్చించారు. మాచర్ల నుంచి వచ్చే లైనులో సరఫరా ఆగితే.. ప్రత్యామ్నాయంగా నరమాలపాడు లైను నుంచి విద్యుత్తు సదుపాయం కల్పించేలా ఏర్పాట్లు చేశారు. ఇకపై గురజాలకు నిరంతరం విద్యుత్తు సరఫరా కానుంది. ఎమ్మెల్యే యరపతినేని చొరవతో నిధులు మంజూరు చేయించి, పనులు వేగంగా జరిగేలా కృషి చేశారు.



గురజాల సబ్‌స్టేషన్

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో ఇద్దరి మృతి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం పట్టణంలోని జానపాడురోడ్డులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రాజుపాలెం మండల రెడ్డిగూడెం గ్రామానికి చెందిన షేక్ బాబాపీర్(38) మండలంలోని జానపాడులో బంధువుల ఇంటిలో జరిగే శుభకార్యానికి ద్విచక్ర వాహనం మీద వచ్చారు. తిరిగి ఇంటికి వెళుతుండగా జానపాడురోడ్డులోని రైల్వేగేటు సమీపంలో ఎదురుగా వచ్చే మరొక ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో బాబాపీర్‌కు గాయాలు కావటంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఆసుపత్రికి తీసుకవెళ్లిన కొద్దిసేపటికి అతను మృతి చెందారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై డి.శివనాగరాజు కేసు నమోదు చేశారు.

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: దిచక్ర వాహనం మీద నుంచి పడి వ్యక్తిమృతి చెంది, మరోవ్యక్తికి గాయాలైన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలోని మాచర్ల రోడ్డులో ఉన్న ఖలీల్ రెస్టారెంటు వద్ద చోటు చేసుకుంది. పోలీసులు వివరాల మేరకు.. పట్టణానికి చెందిన కపిలవాయి మణిదీప్, కాటేపల్లి వెంకటేశ్వర్లు(49) కళ్లం టౌన్‌షిప్ ప్రాంతం నుంచి ద్విచక్ర వాహనం మీద పట్టణంలోకి వస్తున్నారు. ఖలీల్ బార్ రెస్టారెంటు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు, మణిదీప్‌కు గాయాలు కావటంతో వారిని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్సకోసం తరలించారు. వెంకటేశ్వర్లుకు మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. మృతుని భార్య సీతామహాలక్ష్మీ ఫిర్యాదు మేరకు ఎస్సై డి. శివనాగరాజు కేసు నమోదు చేసి దర్యాదు చేస్తున్నారు.


కాటేపల్లి వెంకటేశ్వర్లు (పాత చిత్రం)

చోరీ కేసులో దొంగకు రిమాండ్

ముప్పాళ్ల, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనం చోరీ కేసులో దొంగను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్సై సోమేశ్వరరావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన పిచ్చయ్య ఆ గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహం ఎదురుగా ద్విచక్ర వాహనం పార్కింగ్ చేయగా ఈ నెల 11న బైకు చోరీకి గురైంది. దీనిపై కేసు నమోదవ్వగా రాజుపాలెం మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన నిందితుడు తమ్మిశెట్టి గోపిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి ద్విచక్ర వాహనాన్ని రికవరీ చేసినట్లు ఎస్సై తెలిపారు.